# ఫర్‌సేల్



రాత్రి పన్నెండవుతోంది.

దిల్‌షుక్‌నగర్ ప్రాంతంలోని రోడ్లన్నీ పదిగంటలనుంచే కిక్కిరిసిపోయి ఉన్నాయ్.

నేనూ, రంగారెడ్డీ, శాయిరామ్, గోపాల్రావ్, యాదగిరీ, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ అందరం ఆ జనంలోనే యిరుక్కుని నిలబడ్డాము. పోలీసులు జనం రోడ్‌మీద కొచ్చినప్పుడల్లా వాళ్ళను విజిల్స్‌ద్వారా లాఠీల ద్వారా బెదరగొట్టి వెనక్కుతోసేస్తున్నారు. ఆ హడావుడిలో వచ్చి ఆగింది ఓ నల్లనివ్యాన్.

"పరీక్షారథం పరీక్షారథం" అని జనం అనుకోవటం యజ్ఞం జరిగినప్పుడు వల్లించే సంస్కృత శ్లోకాల్లా వినబడుతోంది.

ఆ వ్యాన్ మీద రంగుబల్బులతో రాసిన "పరీక్షారథం" అనే అక్షరాలు ఆరుతూ వెలుగుతూ కనబడుతున్నాయ్. ఆ వ్యాన్ టాప్ మీద కొచ్చి నిలబడ్డాడు ఓ వ్యక్తి.

"భాయియో, బహెనో– మెహర్బానీ కర్‌కే ఖామోష్ రహియే–"

అంతా నిశ్చబ్దమయిపోయారు.

"మొదలు మేము టెన్త్‌కాస్ కొశ్చెన్ పేపర్లు ఇచ్చెడిదున్నది. దాన్ని గురించి ఇంటర్మీడియట్ పేపర్లు కావల్సినోళ్ళు జరా వెనక్కు నిలబడండ్రి."

కొద్దిసేపు తోపులాటలు, కుమ్ములాటలు జరిగినయ్.

మరోవ్యక్తి వ్యాన్‌టాప్‌మీద కొచ్చాడిప్పుడు.

"మొదట టెన్త్‌క్లాస్ సైన్స్‌పేపర్ ఇస్తున్నామండి! ఎవరికండీ సైన్స్‌పేపర్? క్యూలో వస్తే త్వరత్వరగా ఇచ్చేయటానికి వీలవుతుంది–"

జనంలోనుంచి హర్షధ్వానాలు వినిపించాయ్. వెంటనే పోలీస్ వాళ్ళ సహాయం లేకుండానే క్యూ తయారయింది.

"సైన్స్ పేపర్– కేవలం నాలుగొందల నాలుగు రూపాయల డెబ్బయ్ పైసలు. అందరూ కాష్ రడీగా పట్టుకోండి సార్–"

యాదగిరి కోపంగా వాన్ దగ్గరకు నడిచాడు.

"క్యా హైమియా! నీయిష్టమొచ్చిన లెఖ్ఖ ధరచెప్తున్నావ్ ఏమి సంగతి? మోజంజాహి మార్కెట్ల మూడొందల అరవై రెండ్రూపాయలికే ఇస్తున్రుగదా?" అన్నాడతను.

"అక్కడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంచాయనసార్! చాలా రీజనబుల్‌రేట్స్‌లో ఉంటాయివాళ్ళ మామూళ్ళు."

"ఆ సంగతలావుంచి డెబ్భైపైసలేమిటి? ఇందులో చిల్లర వ్యవహారమేమిటయ్యా మళ్ళా–" అడిగాడు గోపాల్రావ్.

"దానికి మనమేమీ చేయలేం సార్! స్థానిక పన్నులు ఆదనం అని మీకూ తెలుసుకదా?"

"పరీక్షల ప్రశ్నాపత్రాలకు స్థానిక పన్నులా?"

"అవున్సార్! సేల్స్‌టాక్స్! అమ్మకాలు జరిగిన ప్రతి వస్తువుకి 'సేల్స్‌టాక్స్' కట్టక తప్పదుగదండి–"

"అదేం కుదరదు. మూడొందల అరవై రెండ్రూపాయలకు ఒకపైసాకూడా ఎక్కువివ్వం–" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"ఇవ్వకపోతే పోవయ్యా– నువ్వు కొనకపోతే ఇంకోడు కొంటాడు" అన్నాడా వ్యక్తి.

ఆ మాటతో మా అందరికీ కోపం వచ్చింది.

"సోదరులారా! మూడొందల అరవై రెండ్రూపాయలకిచ్చే వరకూ మీరెవరూ ఈ ప్రశ్నాపత్రాలుకొనవద్దు–" అంటూ అరచాడు శాయిరామ్.

"అవునూ– కొనొద్దు" అంటూ అరచాం మేమందరం. అయితే మా మాట ఎవరూ వినిపించుకోకుండా ఎవర్దారిన వాళ్ళుకొనుక్కువెళ్ళటం చూసేసరికి మా అరుపులు విరమించుకుని మేమూ వెళ్ళి క్యూలో నిలబడ్డాము.

కాసేపట్లో ఆ ప్రశ్నాపత్రాలు అమ్మటం పూర్తయింది. ఈ లోగా ఇంకో కొత్త బండిల్ మరో కార్లో వచ్చింది.

"సోదరులారా! లెక్కల పేపర్లుకూడా ఇప్పుడే వచ్చాయి. తాజా సరుకు! ఒక్కొక్కటి ఏడొందల ఆర్రూపాయల-నలభై ఎనిమిది పైసలు (ఇంక్లూడింగ్ ఆల్‌టాక్సెస్) త్వరగా కావలసినవాళ్ళు 'క్యూ' కట్టండి" అంటూ మైక్‌లో అరచాడా వ్యక్తి.

అందరూ మళ్ళీ క్యూలో జొరబడ్డాము.

సగం పేపర్లు అమ్మారోలేదో హఠాత్తుగా పెద్దసైరన్లతో పోలీస్‌కార్లు, జీప్‌లు, వచ్చి నిలబడ్డాయక్కడ. వాటిల్లో నుంచి బిలబిలమంటూ పోలీసులు దిగారు. ఆ పరీక్ష పేపర్లమ్మే వాళ్ళను అరెస్ట్ చేస్తారని అనుకున్నారందరూ. తీరా చూస్తేవాళ్ళు హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్సుమీద కూర్చున్న కొంతమందిని చెలాన్‌చేసి తలో ఇరవై రూపాయలూ వసూలు చేశారు. ఆ తరువాత తాగుడు వాసన వస్తున్న మరో అయిదారువందలమందిని చెలాన్ చేసేశారు. అక్కడితో ఆగక ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు కారణమ యారన్న నెపం మీద మరో పదిమంది తోపుడుబండి వాళ్ళనూ, రాత్రిళ్ళుహోటళ్ళు తెరిచి ఉంచినందుకు హొటల్ వాళ్ళనూ కూడా చలాన్ చేశారు. ఆఖరులో "పరీక్షారథం" దగ్గరకొచ్చారు.

"ఎవరిదయ్యా ఈవాన్?" అడిగాడు అధికారి బండగొంతుకతో

"మాదేసార్"

"రాంగ్ పార్కింగ్ ఎందుకు చేశావ్?"

"పార్కింగ్‌బోర్డు ఉందిసారిక్కడ" అంటూ ఆ వాన్ వాళ్ళే తెచ్చి పాతిన ఓ బోర్డు వంక చూపాడతను.

అధికారికేం మాట్లాడాలో తెలీలేదు.

"సరే- మా ఆఫీసర్లకు... టెన్త్ ఇంటర్ రెండు సెట్లు కొశ్చెన్ పేపర్స్ కావాలి! త్వరగా ఇవ్వు" దర్పంగా అడిగాడతను.

"రెండు సెట్లకూ కలిపి నాలుగువేల తొంభయి రూపాయలు ఇవ్వండిసార్!" పోలీస్ అధికారికి కోపం ముంచుకొచ్చింది.

"ఏమిటి? మేముకూడా డబ్బివ్వాలా?"

"అవున్సార్! మేము మాత్రం పోలీస్ డిపార్టుమెంట్ వాళ్ళకు డబ్బుకట్టొద్దాసార్?"

"అయితే ఫ్రీగా ఇవ్వవన్నమాట."

"ఇవ్వంసార్"

"అయితేసరే- ఏయ్ ఎయిట్‌ఫార్టీ! వీళ్ళందరినీ మనవాన్ ఎక్కించు" అన్నాడతను కసిగా.

"ఎందుకుసార్? మేమేం నేరం చేశాం?" కోపంగా అడిగాడావ్యక్తి.

"మీరు నక్సలైట్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు మాకిప్పుడే ఇన్ఫర్మేషన్ వచ్చిందని అంటాను. కాదని ఎవడు ఋజువు చేస్తాడు."

వాళ్ళు వెంటనే వాన్ దిగి ఆ అధికారుల కాళ్ళమీద పడిపోయారు.

"సరేసార్– కొశ్చెన్ పేపర్స్ సగంధర కిస్తాం! తీసుకోండి."

"కుదరదయ్యా ఫ్రీగా కావాలి! అంతే! కొత్తపద్ధతులు ప్రవేశపెడుతున్నారేమిటి మీరు?"

"పోనీ వెయ్యిరూపాయలయినా ఇవ్వండిసార్"

"ఏయ్! మాలో ఎవరయినా ఎప్పుడయినా జేబులో నుంచి డబ్బు తీయటం చూశావా నువ్వు"

"లేద్సార్"

"మరింకా పిచ్చివేషాలేస్తావెందుకు? అయినా నీ హెల్మెట్ ఏదీ?"

"నాకెందుకుసార్– నాకు మోటార్‌సైకిల్ లేదుగా?"

"వాట్? మోటరుసైకిల్ కూడా లేదా? దిసీజ్ టూమచ్! హెల్మెట్ ఒక్కటీ లేదంటే ఎలాగోలా జాలిపడి వదిలేవాడిని! మోటార్‌సైకిల్ కూడా లేదంటే నువ్వెంత డేంజరస్ ఫెలోవో తెలుస్తోంది. ఏయ్ ఎయిట్ ఫార్టీ– వీడిని లోపల ఏసేయ్."

"గొడవెందుకులెండి సార్– ఇవిగో! కొశ్చెన్ పేపర్లు, వెళ్ళిపోండిక– "పోలీస్‌వాన్‌లన్నీ వెళ్ళిపోయాయి.

క్యూ మళ్ళీ ముందుకు జరిగి హఠాత్తుగా ఆగిపోయింది.

"ఏమిటి? మీరు ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నారని కన్సెషన్ రేట్లో ఇవ్వాలా? చాల్చాల్లే వెళ్ళండయ్యా! అందరికి ఫ్రీలు, కన్సెషన్లు ఇచ్చి ఇంక మేమేం తినాలయ్యా మట్టి? ఇష్టమయితే ఫుల్‌రేటుకి తీసుకోండి– లేదంటే లేదు."

వాళ్ళు గొణుక్కుంటూ ఫుల్‌రేటుకి కొనుక్కోక తప్పలేదు. మేము డబ్బు కట్టి పేపర్లన్నీ తీసుకునేసరికి తెల్లారుజామున మూడయింది. మా కాలనీ వాళ్ళందరూ ఆడామగా పిల్లాపీచూ– అందరూ మాకోసమే ఎదురుచూస్తూన్నారక్కడ ఆత్రుతగా.

శాయిరామ్ ఉత్సాహంగా మైక్ దగ్గరకు నడిచాడు. చాలా రోజుల తరువాత అతనికి మళ్ళీ మైక్‌ముందు నిలబడే అవకాశం వచ్చినందుకు ఎంత ఆనందంతో ఉన్నాడో అతని కళ్ళు చూస్తేనే తెలిపోతోంది.

"సోదరీ సోదరులారా! ఇంతకాలంగా మనందరం పరీక్షల ప్రశ్నాపత్రాల కొనకుండా మన కాలనీ పిల్లలతో పరీక్షలు రాయించాము. అందువల్ల నగరంలో మిగతా విద్యార్థులందరికీ డిస్టింక్షన్స్ వస్తే మన కాలనీ వాళ్ళకు పాస్ మార్కులు కూడా గగనమైపోయాయ్. అందుకే

ఈసారి మిగతా తెలుగు ఫోరులలాగానే మనం కూడా పరీక్ష పత్రాలు కొనుక్కొచ్చాము. నేను ఒక్కొక్క పేపరే మైక్‌లో చదువుతాను. మీరందరూ నోట్‌చేసుకోండి."

అందరూ తప్పట్లు కొట్టారు.

శాయీరామ్ ఒక్కొక్క ప్రశ్నే చదవటం ప్రారంభించాడు. అందరూ నిశ్శబ్దంగా రాసుకోసాగారు. అన్ని పేపర్లూ పూర్తయ్యేసరికి తెల్లారుజామున నాలుగయిపోయింది.

"అలా వట్టి ప్రశ్నలు చెప్తే ఏం లాభం? సమాధానాలు కూడా చెప్పండి" అంది పార్వతీదేవి.

"అవును! ఆన్సర్ కూడా కావాలి" అంటూ అరచారు టెన్త్ కుర్రాళ్ళు.

"అన్సరేమిటి! మీస్కూల్లో ఆన్సర్ చెప్పలేదూ?"

"మా స్కూల్లో చెప్పలేదు. అసలు మాకు సోషల్ టీచరే లేదుగా!" అన్నాడు విజయ్‌బాబు.

"మా స్కూల్లో సైన్స్ టీచర్ మధ్యలో మానేసింది. అందుకని మాకు సగం పోర్షనే అయింది" అంది రాజేశ్వరి చెల్లెలు ఆరణి.

"మాకు టీచర్లున్నారుగాని ఏమీ చెప్పరు" అన్నాడు గోపాల్రావ్ కొడుకు.

అందరం కలిసి కొశ్చెన్ పేపర్స్ దగ్గర పెట్టుకుని నాలుగు గైడ్స్ తెప్పించి అన్నింటికీ ఆన్సర్స్ తయారుచేశాము.

వాటిని మళ్ళీ శాయీరామ్ మైక్ దగ్గర చదువుతూంటే అందరూ రాసుకున్నారు.

ఉదయం ఎనిమిదిగంటలకే అందరం కాలనీ పిల్లలను తీసుకుని బస్‌లో ఎగ్జామినేషన్ సెంటర్‌కి బయల్దేరాము. అరగంట తర్వాత ఆ ఏరియాకు చేరుకుని మహాత్మా ఎడ్యుకేషనల్ ఎకాడమీ గురించి వాకబు చేశాము. ఎంతమందిని అడిగినా మాకు తెలీదని చెప్తూండేసరికి మాకు భయం పెట్టుకుంది. పరీక్ష టైమ్‌లోపల ఆస్కూలుని కనుక్కోగలమో లేదో అని! చివరకు బోలెడు గేదెల షెడ్లున్న ఒ కాంపౌండ్ కనిపించింది మాకు చాలామంది అక్కడ పాలకోసం గిన్నెలు పట్టుకుని నిలబడి ఉన్నారు.

పాలుకొంటున్న ఓ వ్యక్తి దగ్గరకెళ్ళి అడిగాడు రంగారెడ్డి, ఆస్కూల్ గురించి!

"ఇదేనయ్యా ఆ స్కూలు! బోర్డుకనబడటం లేదూ?" అంటూ ఆ పాకకు వేలాడుతోన్న బోర్డు చూపించాడు.

అందరం అప్పుడ చూశాం ఆ బోర్డుని! పెద్ద అట్టముక్క మూలలు చిరిగిపోయి ఉంది. దానిమీద బొగ్గుతోరాశారు "మహాత్మా ఎడ్యుకేషనల్ అకాడమీ" అని.

"మరి స్కూల్ బిల్డింగ్ ఎక్కడా?" అడిగాడు రంగారెడ్డి ఆ ఆసామీని.

"అవేమిటయ్యా! ఆ పాకలు కనబడటంలేదూ?" విసుక్కున్నాడతను.

మాకు మరీ ఆశ్చర్యం కలిగింది. తిన్నగా వెళ్ళి పాలుపోస్తూన్న ఆసామీని అడిగాము.

"అవిగో! ఆ చివరి రెండుపాకలూ స్కూలువే. ప్రిన్సిపాల్ అక్కడే కూర్చుని ఉన్నాడు చూడండి."

అందరం చివరి పాకల దగ్గరకు నడిచాము.

ఓ టేబుల్ మీద 'ప్రిన్సిపాల్' అని బోర్డు పెట్టి ఉన్నచోట ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"నమస్కారం సార్" అన్నాడు రంగారెడ్డి.

"నమస్తే! హాలు టికెట్స్ చూపించండి" అన్నాడతను.

అందరం హాల్ టికెట్స్ చూపించాము.

అప్పటికప్పుడే టేబుల్ మీద చాక్‌పీస్తో నెంబర్లు వేసేశాడతను.

"కూర్చోండి" అన్నాడు పిల్లలతో.

మా వాళ్ళంతా వెళ్ళి సీట్లలో కూర్చున్నారు.

"ఏరా– పరీక్షటైమవుతుంది– ఇంకా అవలేదురా నీపని" అరచాడు ప్రిన్సిపాల్– పాలుపోస్తున్న వ్యక్తిని చూస్తూ.

"అయిందయింది" అన్నాడతను.

"త్వరగా గేదెలను బయటకు తోలెయ్! పరీక్ష టైమవుతోంది"

అతను మిగిలిన వారందరికీ కూడా పాలుపోయటం ముగించి గేదెలను బయటకు తోలేశాడు.

మరికాసేపట్లో కార్లు, స్కూటర్లు, సైకిళ్ళమీద విద్యార్థులు రావటం ప్రారంభమయిపోయింది.

"అందరి దగ్గరా ఆన్సర్ పేపర్స్ ఉన్నాయిగదా!" అడిగాడు శాయిరామ్ మా వాళ్ళను.

"ఉన్నాయ్" అన్నారువాళ్ళు.

"కొశ్చన్ పేపర్స్ ఇవ్వగానే మన ఆన్సర్స్‌చూసి రాసేయండి–" రహస్యంగా చెప్పాడు రంగారెడ్డి.

"ఆ తర్వాత మీరు తెచ్చిన కాగితాలన్నీ మాకిచ్చేయండి– మేమే బయట పారేస్తాము. లేకపోతే పట్టుబడ్డారంటే మా స్కూల్ పరువుపోతుంది" అన్నాడు ప్రిన్సిపాల్.

మేము ముందు కంగారుపడినా ఆయన మాటలకు ఆనందించాము.

పరీక్ష మొదలయింది. మేమంతా బయట నిలబడ్డాము. పోలీస్‌కానిస్టేబుల్స్ ఇద్దరు వచ్చి మా దగ్గరలో కూర్చున్నారు.

మధ్యమధ్యలో మేమంతా దూరం నుంచే సైగలు చేసి కనుక్కుంటున్నాము. వాళ్ళు చక్కగా కాపీ చేస్తోందీ లేనిదీ.

హఠాత్తుగా ఓ జీప్ వచ్చి పాకలముందాగింది. అందులోనుంచి పోలీసులూ మరికొంతమంది మామూలు దుస్తులవాళ్ళూ దిగి పాకల్లోకి పరుగెత్తారు.

"చచ్చాం రా నాయినా! ఫ్లయింగ్ స్క్వాడ్ వాళ్ళు వచ్చారు" అన్నాడు గోపాల్రావ్. అందరిలోనూ టెన్షన్ పెరిగిపోయింది.

"మనవాళ్ళు ఎవరయినా పట్టుబడితే సంవత్సరం వృధా అయిపోయింది" అన్నాడు శాయిరామ్ దిగులుగా.

పావుగంట తర్వాత జీప్ వెళ్ళిపోయింది. వెంటనే అందరూ పాకలవేపు పరిగెత్తాము.

ప్రిన్సిపాల్ మా దగ్గరకు చిరునవ్వుతో వచ్చాడు.

"ఏం ఫర్లేదులెండి! ఆ స్క్వాడ్‌లో ఒకాయన కొడుకు మన పాకల్లోనే పరీక్ష రాస్తున్నాడు. ఇక్కడ ఎవరినీ పట్టుకోరు."

అంతా తేలిగ్గా గాలిపీల్చాము. నాలుగు రోజులు గడిచిపోయాయి. తీరా లెక్కల పేపరు న్యూస్‌పేపర్‌లో పబ్లిష్ అయేసరికి మాకు భయం పట్టుకుంది. పరీక్షలన్నీ ఎక్కడ కాన్సిల్ అవుతాయోనని.

"మీ జర్నలిస్ట్‌లతో ఇదే పేచీ! ఎవ్వడికీ లేని దురద మీకెందుకు! ఇప్పుడు చూడండి! అటు గవర్నమెంటుకీ, ఇటుమనకీ, అందరికి హెడేక్! గోపాల్రావ్ మీద విసుక్కున్నాడు శాయిరామ్!

గోపాల్రావ్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

న్యూస్‌పేపర్లూ, జర్నలిస్ట్‌లూ, మరీ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని వప్పుకున్నాడు.

మర్నాడు మేమనుకున్నంతా అయింది. ఆ తరువాతి పరీక్షలు రద్దయ్యాయి. మా అందరికీ విచారం పట్టుకుంది.

మిగతా పరీక్షలకు బోలెడుడబ్బు పోగుచేయాలి పైగా న్యూస్‌పేపర్ వాళ్ళబెడద ఎక్కువయింది గనుక ప్రభుత్వం కూడా కొంచెం స్ట్రిక్ట్‌గా ఉంటుంది.

అంచేత కొశ్చెన్ పేపర్స్ ధర ఈసారి మరీ ఎక్కువగా ఉంటుంది.

మేమనుకున్నంతా అయింది. ఆ తరువాత కొశ్చెన్ పేపర్స్ ఒకోటి రెండువేలు పెట్టికొనాల్సి వచ్చింది.

రిజల్ట్స్ వచ్చాయి.

మా సంతోషానికి హద్దుల్లేవు. కాలనీలో అందరికీ ఫస్ట్‌క్లాసులు వచ్చాయ్.

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిందాబాద్" అంటూ అరచాడు యాదగిరి ఆనందం పట్టలేక.

కానీ మా ఆనందం ఎంతోకాలం నిలవలేదు.

కాలేజీ సీట్లకోసం వేట ప్రారంభమయింది. శాయీరామ్ ఆ రోజే మీటింగ్ ఏర్పాటు చేశాడు.

"సోదరీ సోదరీమణులారా! మన కాలనీ వాళ్ళను ఏ కాలేజీలో జాయిన్ చేయాలో నిర్ణయించడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాం" అన్నాడు శాయీరామ్.

"బిగ్ ఫ్లవర్ బిగ్ ఫ్లవర్" అంటూ అరచారు ఆడావాళ్ళందరూ. మేమంతా ఆశ్చర్యపోయాం. బిగ్ ఫ్లవర్ కాలేజీ ఒకటుందనీ, దానికి అంతమంచి పేరుందనీ మా ఆడాళ్ళకు తెలిసింది కానీ మాకు తెలీలేదు.

"మానాళ్ళకు ఫస్ట్‌క్లాస్ వచ్చింది కదా! అంతకంటే మంచి కాలేజ్ ఏమీలేదా?" అడిగాడు జనార్ధన్! లేదని తెలిసి అందరం కలిసి "బిగ్‌ఫ్లవర్' కాలేజ్‌కెళ్ళాము.

నేనూ రంగారెడ్డి ప్రిన్సిపాల్ రూమ్ కెళ్ళాము.

"మా కాలనీ స్టూడెంట్స్ అందరికీ ఫస్ట్‌క్లాస్ వచ్చింది. అందుకని మంచి జూనియర్ కాలేజ్‌లో చేర్పించాలని మేమనుకున్నాం. మా వాళ్ళు కొంతమంది మీ కాలేజ్‌పేరు సజెస్ట్ చేశారు. బైదిబై మీ కాలేజ్ స్టాండర్డ్ గురించి మాకు డిటెయిల్స్ ఇస్తే- బాగుందనుకుంటే సగర్వంగా జాయిన్ చేస్తాము." అన్నాడు రంగారెడ్డి. పెద్దగా కిందపడినవ్వి, మళ్ళాలేచి కూర్చీలో కూర్చున్నాడు ప్రిన్సిపాల్.

"ముందు మీ వాళ్ళను ఎంట్రెన్స్ రాయమనండి- సెలక్టయితే తర్వాత చూద్దాం!" అన్నాడు అతికష్టంమీద నవ్వాపుకుంటూ.

నేనూ రంగారెడ్డి మొఖాలు చూసుకున్నాం.

"ఎంట్రెన్సేమిటి?" అడిగాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

"ఎంట్రెన్స్ అంటే మేము మా కాలేజ్‌తరపున పెట్టే పరీక్ష!"

"అదెందుకు?"

"కుర్రాళ్ళలో నిజంగా 'స్టఫ్' ఉందో లేదో తెలుసుకోటానికి."

"ఇంకా తెలీకపోవటమేమిటి సార్! మా వాళ్ళందరికీ ఫస్ట్‌క్లాస్ వచ్చిందికదా"

ప్రిన్సిపాల్ మళ్ళా కిందపడి నవ్వాడు.

ఈసారి నేను- లేచి ఆయనను లేపి కుర్చీలోకి చేర్చాను.

"అందుకే- యిలా అడ్డమయినోడికి ఫస్ట్‌క్లాస్ వస్తోందనే- ఎంట్రన్స్‌పెడత!"

రంగారెడ్డికి కోపం ముంచుకొచ్చింది.

"అంటే మీ ఉద్దేశ్యం ప్రభుత్వం పెట్టే పరీక్షలమీద మీకు నమ్మకం లేదన్నమాట! అంతేనా?"

ప్రిన్సిపాల్ మళ్ళా కిందపడి నవ్వబోతూంటే పడకుండా ముందే ఆపేశాను.

"అహ్హా హ్హా హ్హా! ఓ హ్హా హ్హా హ్హా– ప్రభుత్వ పరీక్షలు! అదో పరీక్ష! దానికో క్లాసులూ, రాంకులూ, అహ్హా హ్హా హ్హా " అంటూ వగరుస్తూ నవ్వసాగాడు. అతనికళ్ళ వెంబడి నీళ్ళుకూడా తిరిగాయ్! నవ్వు ఆపాక మళ్ళా తనే మాట్లాడాడు.

"అబ్బ! అబ్బ! ఎంతకాలనికయ్యా భలే నవ్వించారు మీరెవరో గాని! మీ కాలనీలో అందరూ ఇలాగే జోకులేస్తూంటారా? ఒకసారి మీ కాలనీకి రావల్సిందే! బాగా నవ్వుకోవాలని పించినప్పుడల్లా తప్పకవస్తాను. అడ్రసిచ్చివెళ్ళండి" రంగారెడ్డి అతని అడ్రస్ బుక్‌లో మా కాలనీ అడ్రస్ రాసిచ్చాడు.

ఆయన దగ్గర అప్లికేషన్ ఫారమ్స్ తీసుకుని బయటికొచ్చాము. బయట ఇసుకవేస్తేరాలంత జనం కనిపించేసరికి మతిపోయినట్టయింది మాకు.

"ఏమిటీ జనమంతా?" వరండాలో నిలబడ్డ యాదగిరిని అడిగాడు.

"ఈ బిగ్‌ఫ్లవర్ జూనియర్ కాలేజీలో సీటు గురించి వచ్చిన్రు"

"ఇంతమందా?"

గోపాల్రావ్, జనార్ధన్ దిగాలుపడిన మొఖాలతో జనంలోంచి ముందుకొచ్చారు.

"ఇక్కడ ఉన్నాళ్ళందరి పిల్లలకూ నూటికి తొంభయ్ శాతం మార్కులు వచ్చాయంట" అన్నాడు గోపాల్రావ్.

రంగారెడ్డి నమ్మలేకపోయాడు.

"నూటికి తొంభయి మార్కులా?"

"అవును–"

"ఇక్కడ నిలబడ్డ ఈ రెండు వేలమందికి అన్ని ఎక్కువ మార్కులు వచ్చాయా?"

"అవునంట"

"అంటే మరి మన కాలనీవాళ్ళకు అరవై నాలుగు పర్సేంటేగా వచ్చింది."

అందరం నిశ్శబ్దంగా బయటకు నడిచాము. అంతవరకూ మేమనుభవించిన ఆనందం కాస్తా దిగులుగా మారిపోయింది.

అక్కడి నుంచి అందరం సెవెన్ సెయింట్స్ జూనియర్ కాలేజీకి చేరుకున్నాము. యాదగిరి వెళ్ళి మా కాలనీలో యాభయ్ మందికీ అప్లికేషన్ ఫారాలు పట్టుకొచ్చాడు.

"ప్రాస్పెక్టస్ చదువుతూనే మా గుండెలు ఝల్లుమన్నాయ్.

క్రిస్టియన్స్ కోటలో కొన్ని సీట్లు,

బాక్వార్డ్ క్లాసెస్ కోటాలోకొన్ని సీట్లు,

షెడ్యూల్ క్లాసెస్ కోటా,

సెంట్రల్ గవర్నమెంట్ కోటా,

స్పోర్ట్స్ కోటా,

ఫిజికల్లీ హాండీకాప్డ్ కోటా,

డిఫెన్స్ పరసనల్ కోటా,

వి.ఆయ్.పి. కోటా,

ఈ కోటాలన్నీ పోను మిగిలిన సీట్లు మాత్రం మార్క్సుని బట్టి ఇవ్వబడతాయ్. అంటే మహా అయితే ఓ పాతిక సీట్లు మిగల్తాయ్. ఈ పాతికా ఎనభయ్ శాతం వాళ్ళకో తొంభయ్ శాతం వాళ్ళకో పోతాయి. ఇంక మనకేం దొరుకుతాయ్?

అయిష్టంగానే అప్లికేషన్ ఫారాలు ఫిలప్‌చేసి తలోపదిరూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజులు కట్టి బయటపడ్డాం.

దాంతో ఆరోజు కార్యక్రమం పూర్తయిపోయింది. మర్నాడు మరో మూడు కాలేజీల్లో అప్లయి చేయటం మంచిదని చెప్పాడు గోపాల్రావ్. లేకపోతే సీట్లు దొరకటం కష్టమని వాళ్ల లెక్చరర్ ఫ్రెండొకాయన చెప్పాడట.

అంచేత తెల్లారుతూనే అందరం హడావుడిగా బయల్దేరి తిమ్మరుసు జూనియర్ కాలేజీకి చేరుకున్నాం. అప్పటికే కాలేజీముందు పెద్ద ''క్యూ'' కనిపించేసరికి మాకు మతిపోయినట్లయింది కాలేజీ ఇంకా తెరవనేలేదప్పటికి.

"ఈ క్యూ" దేనికి మాస్టారూ?" రంగారెడ్డి వెళ్ళి "క్యూ" లో ఫలహారం చేస్తున్న ఓ పెద్దమనిషినడిగాడు.

"దేనికేమిటయ్యా! ఇంటర్ అప్లికేషన్ కోసం"

"ఇంటర్ అప్లికేషన్ కోసం ఇంత "క్యూ' యా? అంటే ఈ కాలేజీ చాలామంచి కాలేజా?"

"ఈ కాలేజీలో ఒకడికి కిందటి పరీక్షల్లో స్టేట్ సిక్స్టియత్ రాంక్ వచ్చిందట. అందుకని డిమాండ్ పెరిగిపోయింది–"

మాకు "క్యూ" చూస్తే భయం వేసింది మరి కాసేపటికి తర్వాత గోపాల్రావ్ ఓ వ్యక్తిని తీసుకొచ్చాడు మా దగ్గరకు.

"ఈ కాలేజీలోనే లెక్చరర్ ఇతను! నాకు హైస్కూల్లో క్లాస్‌మేటుగా ఉండేవాడు" అంటూ మాకు పరిచయం చేశాడు.

"మీరంతా మా గోపాల్రావ్ తాలూకూ మనుషులు కనుక నిజం చెప్తున్నా! ఈ కాలేజీకి అప్లయి చేయకండి! వేస్ట్!" అన్నాడతను.

"అదేమిటి?" విస్తుపోతూ అడిగాడు శాయిరామ్.

"అవునండీ! సీట్లన్నీ ఎప్పుడో బాక్‌డోర్‌లో ఒకోటీ పదివేలకు అమ్మేశారు మావాళ్ళు"

"అంటే డొనేషన్ తీసుకున్నారా?" కోపంగా అన్నాడు జనార్ధన్.

"అవునూ! ఏం?"

"మరి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక డొనేషన్లు బంద్‌చేశాం అన్నారు కదా మా అన్నగారు?" అన్నాడు శాయిరామ్.

లెక్చరర్ పగలబడి నవ్వాడు అయిదునిమిషాల సేపు.

"మీరు కూడా మనరాష్ట్ర ప్రభుత్వంలాగానే భలే జోకులేస్తున్నారండీ! ఎవరికయినా మనసు బాగోనప్పుడు మీ కాలనీలోకొస్తే భలే టైమ్‌పాస్ అవుతుందనుకుంటాను. మీ అడ్రసివ్వండి. ఎందుకయినా మంచిది–" అంటూ అతని డైరీలో మా అడ్రస్ రాసుకున్నాడు.

"అవునోయ్! సీట్లన్నీ డొనేషన్లకు అమ్ముకుంటే మరి ఇన్నివేల మందిని క్యూలో ఎందుకు నిలబెట్టారు?"

లెక్చరర్ మళ్ళీ పగలబడి నవ్వాడు.

"నీ యవ్వ! భలేగున్నారండీ మీరు! ఆపిచ్చి వెధవలు బఫూన్లలాగా "క్యూ" లో నిలబడి నానాఛావూ ఛస్తూంటే ఎంజాయ్ చేయకుండా వెధవ ప్రశ్నలేస్తారేమిటి?"

నాకు కోపం ముంచుకొచ్చింది.

"పిల్లల సీట్లకోసం మేము నానాఛావూ ఛస్తోంటే మీకు బఫూన్లలాగా కనబడు తున్నామా?" అన్నాను కోపంగా.

"ఇదిగో చూడండి మాష్టారూ! ఎవడి సరదాలు వాడికుంటాయి.... మీకు సర్కస్‌లూ, సినిమాలూ, మాజిక్‌షోలూ చూసి ఆనందించటం సరదా! ప్రజలను పిచ్చి వెధవలను చేసి ఆడించటం ప్రభుత్వం సరదా! మాకేమో ఇలా సీట్లకోసం ఎగబడే పిచ్చివాళ్ళను చూస్తే సరదా. నాలుగు రోజులు వాళ్ళను "క్యూ" లో నిలబెట్టి మరో నాలుగు రోజులు ఎంట్రెన్స్‌లు, ఇంటర్వ్యూలు పెట్టి టైమ్‌పాస్ చేసుకున్నాక అందరినీ "నో సీట్" అంటూ గెంటేయడంలో ఎంత థ్రిల్ ఉంటుందో అనుభవిస్తేగానీ మీకు తెలీదు"

మేము ఆ కాలేజీకి అప్లయి చేయకుండానే బయటి కొచ్చేశాము. ఆ తరువాత ఆ కాలేజీకి పాతిగ్గజాల దూరంలోనే ఉన్న ఇంకోకాలేజీలో కెళ్ళాము.

"ఇంటర్ అప్లికేషన్ల అమ్మకము అయిపోయినది" అని రాసి ఉంది. బోర్డుమీద, అక్కడి నుంచి గవర్నమెంటు కాలేజీకి చేరుకున్నాము పదకొండు గంటలవుతున్నా ఇంకా ఎవరూ రాలేదు. కాలేజీకి బయటే కూర్చుని బ్రాకెట్ చార్టు చూస్తోన్న ప్యూన్ దగ్గర కెళ్ళాడు రంగారెడ్డి.

"ఇవాళ కాలేజీలేదా?" అడిగాడతనిని.

"ఉందిసార్! నిన్నేగా ఖుల్లా అయింది."

"మరి ప్రిన్సిపాల్‌గారుగానీ, ఆఫీస్‌స్టాప్‌గానీ రాలేదా?" అడిగాడు శాయిరామ్.

"ఇంతవరకూ రాలేసార్! వచ్చెడిదుంటే పదిగంటలకే వచ్చేస్తాండె!"

"మరి కాలేజ్ తెరవకపోతే మాకు అప్లికేషన్ ఫారమ్స్ ఎవరిస్తారు!"

ప్యూన్ ఆ మాట వినగానే ఆనందంగా లేచి నిలబడ్డాడు. "మీకు అప్లికేషన్ ఫారమ్స్ కావాలా సార్? ఇప్పుడేతెచ్చిస్తా! మీరిక్కడే ఉండండి" అంటూ పరుగుతో బయటికెళ్ళి పోయాడు. పావుగంట తర్వాత ప్రిన్సిపాల్‌తో పాటు స్కూటర్ మీద వచ్చేశాడు.

"రండి రండి ఫారమ్స్ ఇస్తాను" అంటూ మమ్మల్ని తనగదిలోకి తీసుకెళ్ళి అప్లికేషన్ ఫారమ్స్ అందరికీ తలోటీ ఇచ్చాడు ఆనందంగా.

"త్వరగా ఫిలప్‌చేసి ఫీజు ఇప్పుడేకట్టేయండి" అన్నాడతను. ఆ మాట అనేసరికి మాకు అనుమానం కలిగింది.

"కాలేజీలో కిందటేడు ఎంతమంది పాసయ్యారు?" అడిగాడు రంగారెడ్డి.

ప్రిన్సిపాల్ గర్వంగా చూశాడు మావేపు.

"ఎంతమందా? ఏమనుకుంటున్నారు కాలేజీ గురించి? ఫిఫ్టీ పర్సెంట్ రిజల్ట్స్ మిస్టర్! సగానికి సగం మంది ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు"

మా అందరికి సంతృప్తి కలిగిందా మాట వినేసరికి. తీరా ఫిజుకట్టబోయే ముందు యాదగిరికో ఆలోచన వచ్చింది.

"పాసయినవాండల్ల లిస్ట్ జరా చూపించండ్రి" అన్నాడు ప్రిన్సిపాల్‌తో. ప్రిన్సిపాల్ మొఖంలో రంగులు మారాయి.

"అంటే నామాట మీద నమ్మకం లేదా?"

"లేదు! ఇయ్యాళ్రేపు దొంగబాడకవ్‌లు చాలామంది స్కూళ్ళుకాలేజీలు పెడుతున్రు."

"మాది గవర్నమెంటు కాలేజయ్యా!"

"గవర్నమెంటు అందరికంటే బడాచోర్‌లు! లేకుంటే ఏమిటి? కె.జి. సీట్లకు పరిషాని! ఇంటర్ సీట్లకు పరిషాని! డిగ్రీ సీట్లకు పరిషాని! ప్రైవేటు కాలేజీ వాళ్ళతోటి కల్సిపోయి, ఆళ్ళదగ్గర పైసల్దిని, గిట్ల సీట్లస్కేర్సిటి కావాలని స్పష్టిస్తున్రు! నంగా బాడుకవ్‌లు"

ఇంక చేసేది లేక ప్రిన్సిపాల్ ఆల్మారాలోంచి ఓ ఫైలు తీసి మాముందు పడేశాడు.

అందులో ఒకే ఒక్క కుర్రాడి మార్క్స్ లిస్ట్ ఉంది. అతి తక్కువ మార్కులతో పాసయ్యాడతను.

"ఏమిటి? ఫిఫ్టీ పర్సెంట్ ఫస్ట్‌క్లాస్‌లోపాస్ అన్జెప్పి ఒక్క మార్క్స్ లిస్ట్ చూపిస్తున్నావ్?" అడిగాడు యాదగిరి.

"అవునయ్యా! మా కాలేజ్‌లో ఇద్దరే స్టూడెంట్స్! ఒకడు తప్పాడు. ఒకడు పాసయ్యాడు ఫిఫ్టిపర్సెంట్ రిజల్ట్స్ కాదా అవి?"

మాకెవరికీ మాట రాలేదు.

మారు మాట్లాడకుండా యాదగిరిని బయటికీడ్చుకొచ్చి ఇంకో కాలేజీ వేపు బయల్దేరాము. విజయనగర్‌కాలనీ ప్రాంతంలో మరోమంచి కాలేజ్ ఉందని చెప్పటంతో అటువేపు బస్ఎక్కాము.

బస్ దిగగానే ఎదురుగా పాడుపడినట్లున్న ఓ పెంకుటింటి ముందు బోర్డు కనిపించింది.

"కైలాసా జూనియర్ కాలేజ్, రికగ్నయిజ్‌డ్ బైదిగవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్!"

1986-87 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో కెల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఏకైక జూనియర్ కాలేజ్.

నూటికి నూరుశాతం ఫస్ట్‌క్లాస్‌లు"

అందరం ఆత్రుతగా లోపలికెళ్ళాం ఓ వ్యక్తి టేబుల్ ముందుకూర్చుని ఏవో ఫైల్స్ చూస్తున్నాడు. అతని టేబుల్ మీద ప్రిన్సిపాల్ అన్న బోర్డు ఉంది.

"యస్. వాడ్డూయూవాంట్?" అన్నాడతను- మా వంకచూసి.

"ఎడ్మిషన్ కావాలి సార్! మాకాలనీ వాళ్ళందరూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. ఇంటర్ ఎమ్.పి.సి.లో సీట్లు ఇప్పిస్తారేమోనని"

అతను ఓ క్షణం ఆలోచించాడు.

"అప్లికేషన్స్ నిన్న ఒక్కరోజులోనే అయిపోయాయి... మీరు నిన్నే వస్తే బాగుండేది" అన్నాడు జాలిగా.

"సార్! ఎలాగోలా దయచూడండి సార్! మీ కాలేజ్ ఎంతో గొప్ప కాలేజ్ అని జంటనగరాల్లో అందరూ చెప్పారు అందుకని ఇంకెక్కడా ప్రయత్నించకుండా తిన్నగా ఇక్కడికొచ్చాము" అబద్ధా లాడేశాడు శాయిరామ్.

"అవున్సార్! మీరు దయచూడకపోతే మాకింకెవరూ దిక్కులేరు" అంటూ గోపాల్రావ్‌కి కన్నుకొట్టాడు రంగారెడ్డి.

గోపాల్రావ్ ధభేల్మని ఆయన కాళ్ళమీద పడిపోయాడు.

"ఆల్‌రైట్! కాళ్ళమీద పడ్డారు కాబట్టి సీట్స్ ఇస్తున్నాఉ. తలో యాభయ్ రూపాయలూ ముందు అప్లికేషన్ ఫారమ్స్‌కోసం ఇవ్వండి."

"యాభై రూపాయలా" ఉలిక్కిపడుతూ అడిగాడు శాయిరామ్.

"ఇలాంటి వెధవ ప్రశ్నలేస్తే మెడబట్టి బయటకు గెంటిస్తాను. ఇడియట్స్! బ్లడీ ఫూల్స్! పోన్లేగదాని సీటిస్తానంటే యాభై రూపాయిల కోసం గొణుగుతున్నారా పిసినారి వెధవల్లారా?"

మా అందరికీ కోపం ముంచుకొచ్చింది. వెధవ సీట్లకోసం వాడితో తిట్టుకూడా తినాలా!

"ఏమ్ జరా మంచిగ మాట్లాడు–" అన్నాడు యాదగిరి చొక్కాచేతులు పైకిముడుస్తూ, కానీ అతనిని గోపాల్రావ్ శాయిరామ్ నోరు మూసి వెనక్కులాగేశారు.

"మన పిల్లల భవిష్యత్తుకోసం అడ్డమైనవాడితోనూ మాటలు పడక తప్పదయ్యా" అంటూ నచ్చజెప్పారతనికి.

"సరేసార్! యాభయ్ రూపాయలిస్తాం" అన్నాడు రంగారెడ్డి. వెంటనే ప్రిన్సిపాల్ తన డ్రాయర్ సొరుగులోనుంచి మరకలతో నిండి ఉన్నపాత న్యూస్‌పేపర్ కాగితాలు కొన్ని లాగి ముక్కలు ముక్కలుగా చింపి అందరికి తలోటి ఇచ్చాడు. మాకేం అర్థంకావటం లేదు.

"అదే అప్లికేషన్ ఫారం! డబ్బివ్వండి" అన్నాడతను దబాయింపుగా. మాకు మతిపోయినట్లయింది.

సరిగా అప్పుడే లోపల్నుంచి ఒక స్త్రీ బయటకొచ్చింది.

"అయ్యో! అప్పుడే మళ్ళీ వచ్చారా జనం! అబ్బబ్బ! ఛస్తున్నాను ఈ సీట్లకోసం తిరగే పిచ్చాళ్ళతో! ఇదిగో చూడండిబాబూ! ఆయన మావారే! మా అబ్బాయిల సీట్లకోసం తిరిగి తిరిగి పిచ్చెక్కింది. అపట్నుంచి అలా బోర్డ్ పెట్టుక్కూచుని అందరి ప్రాణం తీస్తున్నారు. వెళ్ళిపోండి మీ దారిన మీరు–"

"ఆ! వీడు పిచ్చాడా?" ఆశ్చర్యంగా అన్నాడు శాయిరాం.

ఆ మాట వినడంతోనే ఆ వ్యక్తికి కోపం ముంచుకొచ్చింది.

"ఏమిట్రా? నేను పిచ్చాడినా? బాస్టర్డ్స్" అంటూ డ్రాయర్ సొరుగులో నుంచి కత్తి తీసుకుని పొడవటానికి మీదకొచ్చాడు. మరుక్షణంలో అందరం అతి వేగంగా రోడ్‌మీదకొచ్చాము. అతనుకూడా వెంట పరుగెత్తుకు రావటం చూసేసరికి మా గుండెల విసిపోయాయ్. రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆర్టీసి బస్ డ్రైవర్ కండక్టర్– మమ్మల్ని చూసి "రండి– బస్ ఎక్కేయండి" అంటూ అరచారు.

అందరం పరుగెత్తి బస్ ఎక్కేశాము. పిచ్చాడు మమ్మల్ని చేరుకునేలోపలే బస్‌స్టార్టు చేశాడు డ్రైవర్.

"కేవలం ఈ పిచ్చాడి బారినుండి పారిపోయి వచ్చేవాళ్ళకోసం ప్రత్యేకంగా వేశాంసార్ ఈ బస్! ప్రతిగంటకు ఓ బాచ్ ఆ ఇంట్లోనుంచి పారిపోయి వస్తుంటారు కదా సీట్ల పిచ్చాళ్ళు–"

మా అందరికీ కోపంతో రక్తం ఉడికిపోయిందిగానీ ఏమీ మాట్లాడలేదు. బస్‌లో కోఠీ చేరుకుని పక్కనే ఉన్న హొటల్లో కూర్చుని తలో వన్‌బైటూ "టీ" ఆర్డర్ చేశాము.

"ఇప్పుడేం చేద్దామంటారు?" అడిగాడు రంగారెడ్డి.

ఎవ్వరం జవాబివ్వలేదు. అందరి దృష్టీ మాకవతల టేబుల్ దగ్గర వ్యక్తి చదువుతున్న పేపర్‌మీద పడింది.

పేపర్ వెనుక పేజీలో స్పష్టంగా కనబడుతోంది ప్రకటన–

"సరికొత్త జూనియర్ కాలేజ్ నేడే ప్రారంభం! తెగ చదివిన అధ్యాపకవర్గం! స్టూడెంట్స్‌ని చీల్చిచెండాడే డిసిప్లిన్! యూనియన్ మినిష్టర్ భగీరాగారి ఆధ్వర్యంలో– రాష్ట్ర విద్యామంత్రి గారిచే ప్రారంభోత్సవం! అంచేత పరీక్షా పేపర్లు లీక్ అవకపోయినా విద్యార్థులకు సప్లయ్ చేసే బాధ్యత మాది! నూటికి నూటరెండుశాతం ఫస్ట్‌క్లాస్ పాస్‌లు గారంటీ! అంతేగాక స్టేట్ డిస్టింక్షన్ కూడా మా కాలేజ్‌కే ఏర్పాటు చేసే పూచీ మాది, మాదే! మాదే! ఆహా అద్భుతావకాశం. ఓహో! ఆ పూర్వావకాశం. సీట్లు పరిమితం. డొనేషన్లు అపరిమితం. మీకోసం మా వెనుక తలుపు ఎప్పుడూ రెరచే ఉంటుంది (గమనిక: అనివార్య కారణాలవల్ల కాలేజ్ ముందు తలుపుమూసి ఉంచడమైనది, సీట్ల కోసం వచ్చేవారందరూ విధిగా బాక్‌డోర్‌నే ఉపయోగించవలసిందిగా ప్రార్థన).

యాదగిరి ఆనందంగా నా వేపు తిరిగాడు.

"అన్నా! అదిగో! ప్రకటన చూడు" అన్నాడు ఆనందంగా.

అందరం వెళ్ళి ఆ పేపర్ ఓనరుని బ్రతిమాలి అడ్రస్‌నోట్ చేసుకుని ఆ కాలేజీకి చేరుకున్నాం. చాలా అందమయినా బిల్డింగ్ అది.

"రండి! రండి! స్వాగతం" అన్నబోర్డు వేలాడుతోంది. బయట ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు దర్జాగా.

"సార్! మీ కాలేజీ సీట్లు–" అన్నాడు శాయిరామ్ సంశయంగా.

"ఓ! ఇవ్వాళే స్టార్టయినాయ్ ఎడ్మిషన్లు. ఇంకా పదకొండు సీట్లున్నాయ్ ఇప్పుడే బుక్ చేసేసుకోండి! లేకపోతే రేపటికి దొరకవ్"

"అంటే ఏం చేయాలి సార్ మేము?"

"వెంటనే రెండువేలు కట్టండి. పదిహేను రోజుల్లోగా మిగతా– డబ్బు కట్టవచ్చు."

"ఆ! రెండువేలు కాకమిగతా డబ్బా! అదెంత?" నీరసంగా అడిగాడు గోపాల్రావ్.

"ఆ! ఎంతోనా? యాభై ఎనిమిదివేలు"

"ఏమిటి యాభై ఎనిమిదివేలా?" మాటలు తడబడిపోయినాయి జనార్ధన్‌కు.

"రూపాయలు–"

"రూపాయలట" మావేపు తిరిగి చెప్పాడు జనార్ధన్.

"రూపాయలు" అన్నాడు శాయిరామ్ రంగారెడ్డితో.

"మొత్తం అరవైవేల రూపాయలు" అన్నాడు రంగారెడ్డి గోపాల్రావ్‌తో.

"అంటే అన్నీ రూపాయలే నన్నమాట" అన్నాడు చంద్రకాంత్.

"అరవైవేలు ఫీజా? ఇది జూనియర్ కాలేజా లేక మెడికల్ కాలేజా?" అడిగాడు యాదగిరి అనుమానంగా.

"బయట బోర్డు కనబడటంలేదంటయ్యా! ఆ ఫీజు సంవత్సరం మొత్తానికి చదువుకీ, తిండికీ, రూముకీ–"

"కానీ మాకు హాస్టల్ అవసరంలేదు కదండి– మా ఇళ్ళన్ని ఇక్కడికి దగ్గరలోనే ఉన్నాయి."

"అలా కుదరదయ్యా! ఇది కేవలం రెసిడెన్షియల్‌కాలేజ్ అంతే! ఇష్టమయితే చేరండి! లేకపోతేలేదు– నెక్స్ట్" అన్నాడతను. మా వెనుక అప్పటికప్పుడే చేరిపోయిన పాతికమంది క్యూని చూస్తూ.

చిరాకు పుట్టి అందరం అక్కడినుంచి వచ్చేశాము. కాళ్ళీడ్చుకుంటూ కాలనీకి చేరేసరికి చాంతాడులా కాలనీ బయటమెయిన్‌రోడ్‌వరకూ తయారయిన ఓ 'క్యూ' కనిపించింది.

"ఇదేమిటి? వీళ్ళెవరకు మనకాలనీలో 'క్యూ' కట్టారు?" అడిగాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

"అవునవును! మెలికలు తిరిగి తిరిగి మనకాలనీలోకే వెళ్ళిందది" అన్నాడు శాయిరామ్.

'క్యూ'లో చివర నిలబడ్డ వ్యక్తిని సంగతేమిటిన అడిగాడు గోపాల్రావ్.

" ఈ సీజనులో 'క్యూ' లెందుకుంటాయిసార్? కాలేజ్ సీట్లకోసం"

"ఆ విషయం తెలుసయ్యా! మేము ఇప్పటివరకూ 'క్యూ' లోనే నిలబడే వస్తున్నాము. కానీ ఇక్కడెందుకు 'క్యూ' కట్టారు అనడుగుతున్నా?"

"ఎందుకేమిటండీ?" ఇక్కడ శ్యామల్రావ్ జూనియర్ కాలేజ్ అని ఒక కాలేజ్ పెట్టారట. స్టూడెంట్స్‌కి మెరిట్‌రాకపోతే డబ్బువాపస్ అని రాశారు పేపరులో"

మేమందరం మొఖాలు చూసుకున్నాం.

"పోనీ మనవాళ్ళను కూడా ఇక్కడే చేర్పించేద్దామా?" అడిగాడు గోపాల్రావ్ అనుమానంగా.

ఆమాటతో యాదగిరి మండిపడ్డాడు.

"చేర్చక చేర్చక ఈ ఫాల్తూ శ్యామల్రావ్ కాలేజ్‌లోనా జేర్చెడిది? మీకేం దమాక్‌గిట్ట ఖరాబయిందా?"

"అసలు చూద్దాం పదండి ఓసారి" అన్నాడు శాయిరామ్.

అందరం శ్యామల్రావ్ ఇంటికి చేరుకున్నాం. బయట చాలా ఖరీదయిన బోర్డు కనబడింది మాకు.

"శ్యామ్రావ్ జూనియర్ కాలేజ్. రికగ్నైజ్డ్ బై గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" దానికింద ఇంకో బోర్డుకూడా ఉంది.

"ఈ సంవత్సరం రిజల్ట్స్!"

"తొంభయ్ శాతం ఫస్ట్‌క్లాసులు–

పదిశాతం సెకండ్ క్లాసులు–

నాలుగు స్టేట్ రాంకులు సాధించిన అద్భుత శిక్షణా సంస్థ"

అందరికీ వళ్ళు మండిపోయింది ఆ బోర్డు చూసేసరికి. నిన్నటివరకూ అసలు కాలేజియే లేదు.

"ఇదన్యాయం గురూ! పాపం! ఈ జనాన్ని మోసం చేస్తున్నాడు. మనం అందరితోనూ చెప్పేద్దాం! ఇదంతా మోసమని" అన్నాడు రంగారెడ్డి.

"బరాబర్ జెప్పావే! ఈ సాలేగాడు మనకాలనీ ఇజ్జత్ తీశేస్తుండు." అన్నాడు యాదగిరి.

అందరం క్యూలో నిలబడ్డవాళ్ళ దగ్గరకు పరుగెత్తాం.

శాయిరామ్ అప్పటికప్పుడే ఉపన్యాసం ప్రారంభించాడు. జనమంతా మా చుట్టూ మూగిపోయారు. ఉపన్యాసం ముగిశాక మళ్ళా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళి క్యూలో నిలబడే సరిమాకు ఆశ్చర్యం వేసింది.

"ఈ కాలేజీ వాళ్ళు మిమ్మల్ని దారుణంగా మోసం చేస్తున్నారని చెప్పినా మీరు వెళ్ళిపోకుండా మళ్ళీ క్యూలో నిలబడ్డారేమిటి?" అడిగాడు రంగారెడ్డి ఒకతనిని.

"చూడండి సార్! మనల్ని మన ప్రభుత్వమే ఓ పక్క మోసం చేస్తుంటే ఇంకా ఇలాంటివాళ్ళు చేయటంలో తప్పేముంది? ప్రజలు అంటే డెఫినిషన్ "అతి తేలిగ్గా మోసగింపబడే జాతి" అని! అంచేత కానీండి! ఇంకోసారి మోసపోతాం అంతేకదా"

వారం రోజులు గడిచిపోయినయ్ శ్యామ్రావ్ బయట షామ్యానాలు నాలుగేసి నేలమీద విద్యార్థులకు కూర్చోబెట్టి, తనూ, వాళ్ళబ్బాయ్ పాఠాలు చెప్పటం చాలా విచారంతో గమనించాము మేము.

మేము అప్లయ్ చేసిన కాలేజీలన్నీ ఫస్ట్ లిస్టు ప్రకటించాయి. ఆ లిస్టు చూడ్డానికి కొన్నివేల మంది కాలేజ్ దగ్గర గుమికూడడంతో త్రోపులాటలు, కొట్లాటలు జరిగిపోయాయి.

మేమందరం కలిసి లిస్టులకు అడ్డంగా నిలబడ్డ ఓ రౌడీగాంగ్‌ని పక్కకు తప్పుకోమని అడిగినందుకు పేచీవచ్చి ఓ చిన్నసైజు యుద్ధం చేయాల్సివచ్చింది. మాచొక్కాలు, బనీన్లూ చిరిగిపోయాయి ఆ దొమ్మీలో. అయితే ఆ లిస్టులో మా కాలనీ వాళ్ళెవ్వరి పేర్లూ లేవు.

మరో వారం రోజుల తర్వాత సెకండ్ లిస్ట్ పెడతామని చెప్పారు కాలేజ్ వాళ్ళు– వారం రోజుల సస్పెన్స్‌లో గడిపాక ఆరోజు ఉదయం ఆఫీసులకు సెలవులు పెట్టి మళ్ళీ

అన్ని కాలేజీలూ తిరగాము. రాత్రి పదకొండుగంటలకు రెండోలిస్ట్ పెట్టారువాళ్ళు. అందరం టార్చిలైటు వేసుకుని మా కాలనీ వాళ్ళపేర్లు కోసం వెతికాం. ఒక్కపేరు కూడా కనిపించలేదు. మరో వారం తర్వాత మూడోలిస్టూ చూశాము. అందులోనూ పేర్లులేవు. అందరం దిగాలుపడి నిలబడి ఉంటే మా ఆఫీస్‌లో పనిచేసే కుమార్ కనిపించాడు.

"ఏమిటి గురూ? సీట్ దొరకలేదా? ప్రిన్సిపాల్‌ని కలుసుకుని ఆమెకు లంచం ఇస్తానని చెప్పండి! ఠకీమని ఇచ్చేస్తుంది సీట్"అన్నాడతను.

" ఆ నిజంగానా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనలాగే తీసుకున్నానోయ్! కాకపోతే ప్రిన్సిపాల్‌తో డైరెక్ట్‌గా క్యాష్ ఇస్తానని చెప్పకూడదు. ముందు ఒకరు ఆమెతో మాట్లాడుతూంటే వెనకనుంచి ఒకరు చేయిపైకెత్తి ఆమె అటువేపు చూసినప్పుడల్లా అయిదువేళ్ళూ తెరవంటి! ఆమె అర్థంచేసుకుంటుంది".

"కానీ చేతివ్రేళ్ళు చూస్తే ఆమెకెలా అర్థమవుతుంది?" అడిగాడు శాయిరామ్.

"వాళ్లకు వ్రేళ్ళభాష, కళ్లభాష ఇవన్నీవచ్చు. అంచేత అర్థంకాదన్న భయంలేదు."

ఆమర్నాడు ఉదయం అందరం ప్రిన్సిపాల్ దగ్గరకెళ్ళాం. ప్యూన్ బయటే అడ్డంగా నిలబడి ఉన్నాడు.

"ఏంకావాలి సార్?"

"సీట్ కావాలయ్యా! మాపిల్లకాయలకు" అన్నాడు గోపాల్రావ్.

"చాలా కష్టం సార్!"

"ఆ మాటప్రిన్సిపాల్గారు చెప్పితే వెళ్ళిపోతాం!" అన్నాడు రంగారెడ్డి.

"అలాగా!" అన్నాడతను.

"అవును!" అన్నాడు రంగారెడ్డి.

అతను మాపేర్లడిగి లోపలి కెళ్ళి క్షణంలో తిరిగి వచ్చాడు.

"ఆమె ఎవ్వరీని లోపలకు రానీయవద్దంటున్నారు" అన్నాడు మళ్ళీ.

మాకేం చేయాలో తోచటంలేదు. చాలాసేపటి తర్వాతగానీ జనార్ధన్‌కి కోపంరాలేదు.

"నీయమ్మ కాలేజీలు! నీయవ్వ గవర్నమెంట్–తూత్! పదండి! మనపిల్లల్ని నగ్జలైట్లలో చేర్పించేద్దాం! అక్కడ ఈగవర్నమెంట్ ఉద్యోగాలకంటె ఎక్కువ జీతాలిస్తారట!"

అందరం ఓసారి మళ్ళీ మొఖాలు చూసుకున్నాం.

"వాళ్ళెక్కడ కోచింగ్ ఇస్తారట?" అడిగాడు చంద్రకాంత్ అనుమానంగా.

"సత్తుపల్లి అడవుల్లో" అన్నాడు శాయిరామ్.

హఠాత్తుగా ప్రిన్సిపాల్ వెనుక డోర్‌నుంచి పారిపోతూ కనిపించింది మాకు. అందరం ఒకర్నొకరు తోసుకుంటూ పరుగెత్తాము ఆమెను చేరుకోటానికి. చివరికి మాకాలనీవాళ్ళే

గెలిచారు ఆమెను మేము మొదటి వరుసలోనే చుట్టేశాము. మాగొడవంతా విని 'నో సీట్స్' అందామెహఠాత్తుగా. యాదగిరి ముందుకిదూకి ఆమెమొఖందగ్గర చేయి పెట్టి అయిదు వేళ్ళు పైకి కిందకూతిప్పసాగాడు.

"ఏమిటిది?" అందామె అతని చేతివంక అనుమానంగా చూస్తూ. యాదగిరి చిరునవ్వు నవ్వి "అదే మేడం!" అంటూ చేతి వేళ్ళుమరీ ఆమెమొఖం ముందుపెట్టి నాలుగుసార్లు మూసి తెరిచాడు. అంతే! ఆమె కెవ్వున కేక వేసింది.

"బాబోయ్ రక్షించండి! అమ్మో! నాయనో–" అంటూ సైరన్‌లా అరవసాగింది. దాంతో అల్లకల్లోలం అయిపోయింది. ఏం జరిగిందో మాకు సరిగ్గా తెలీదు. అయిదు నిమిషాల్లో పోలీసులు వచ్చారు కాంపస్‌లోకి. మరుక్షణంలో ప్రిన్సిపాల్ వచ్చిమావేపు చూపించింది పోలీసులకు.

"వీళ్ళే సార్! సీట్లు ఇవ్వనన్నానని హిప్నటైజ్ చోయబోయారు నన్ను" భయంగా అందామె.

పోలీస్‌ఆఫీసర్ మమ్మల్ని పరీక్షగాచూశాడు.

"నిజమేనా? ఆమెచెప్పేది?"

"అంతా వర్ధిదేసార్"అన్నాడు రంగారెడ్డి.

"నిజమండీ! ఇదుగోవీడు! వీడు నామొఖంముందు చేయిపెట్టి తిప్పతూంటే నాకు కళ్ళుతిరుగుతున్నట్లయింది! అసలు నాలుగురోజుల్నుంచి మాఇంటి మీద రాత్రుళ్ళు రాళ్లవర్షం కూడా పడుతోంది! సార్! అదంతా ఈగాంగ్‌పనే అనినాఅనుమానం. నేను కారులో తిరుగుతున్నాను కదా! అందుకని చేతబడి చేయటం కుదరక హిప్నటైజ్ చేస్తున్నారు."

"అందరినీ వాన్ ఎక్కించండి!" అన్నాడు పోలీస్ అధికారి. మాపై ప్రాణాలు పైనే పోయాయి.

"సార్! నిజం సార్! మాకే మంత్రాలూ రావండి! మేము మర్యాదస్తులమయిన ఉ ద్యోగస్తుల మండీ!" అంటూ బ్రతిమాలాముగానీ అతను వినిపించుకోలేదు. అందరం పోలీస్‌స్టేషన్ చేరుకున్నాం.

మమ్మల్నందరినీ లాకప్‌లోవేసి చావగొడతారేమోనని భయం పట్టుకుంది అందరికీ. కాని తీరాలోపలికెళ్ళాక మమ్మల్నందరినీ మర్యాదగా కుర్చీలో కూర్చోబెట్టేసరికి మాకు ఆశర్యంవేసింది. ఈలోగా ఆపోలీస్ ఆఫీసరు లోపలకొచ్చాడు. అందరికీ కాఫీలు తెప్పించాడు వస్తూనే.

"చూడండి? మిమ్మల్ని నేనేమి చేయను! కానీ నాకో సహాయం చేయాలి మీరు" అన్నాడు అప్యాయంగా.

"ఏమిటండీ అది?" అడిగాడు రంగారెడ్డి.

"ఇంకోకాలేజీలో మేము మాబంధువులపిల్లల సీట్లు అడ్మిషన్‌కోసం అప్లయ్ చేశాము. కాని వాళ్ళు ఇవ్వనంటున్నారు. ఆ ప్రిన్సిపాల్‌నికూడా హిప్నటైజ్‌చేసి సీట్లిప్పిస్తే మిమ్మల్నందరినీ ఏమీచేయకుండా వదిలేస్తాను."

మాకు మతిపోయినట్లయింది.

"సార్! నిజం చెప్తున్నామండీ! మాకేమంత్రాలూరావు. హిప్నాటిజమూరాదు. మాకాలనీలో ఒకే ఒక్కడు హిప్నటిజం పోస్టల్‌ట్యూషన్‌నేర్చుకుంటున్నాడు. ఎప్పటికయినావాడి గయ్యాళి భార్యను హిప్నటైజ్ చేయాలని వాడిప్రయత్నం! నాలుగేళ్ళయిందిగాని వాడికోరిక ఇంతవరకు నెరవేరలేదు."

పోలీసాఫీసర్‌కి వళ్ళు మండిపోయింది.

"ఏయ్! ఈ కాఫీలన్నీ కాన్సల్ చేసేసి వీళ్ళందరినీ లాకప్‌లో తోయండి. జామీను ఇస్తేగాని వదలకండి! తప్పుడు నా కొడుకులు–" అంటూ లాఠీతో మమ్మల్ని గది బయటకు తోసేశాడు.

చివరకు గోపాత్రావ్ తన అయిడెండిటీ కార్డు చూపించి వాళ్ళని 'ఈ క్షణం' ఎడిటర్‌తో రికమండ్ చేయించాక గానీ మమ్మల్ని వదిలిపెట్టలేదు.

ఆ రాత్రి ఇంటికి చేరుకునే సరికి పన్నెండయిపోయింది శ్యామత్రావ్ మా కోసమే ఎదురుచూస్తున్నాడు "అంతా విన్నాను. మనకాలనీ ఆడాళ్లంతావచ్చి నన్ను బ్రతిమాలారు. మనకాలనీ పిల్లలందరూ సీట్లిమ్మని. తలోరెండువేలూ చాలు డోనేషన్. మిగతావాళ్ళు అయిదువేలిస్తున్నారు" అన్నాడు చిరునవ్వుతో.

"చూడు నాయనా! మనకాలనీ పిల్లల్ని డెకాయిట్స్ చేసేయాలన్న నిర్ణయం ఇంకా తీసుకోలేదు. మేమంతా ఆడెసిషన్ తీసుకోగానే తప్పక మీ కాలేజ్‌లోనే చేర్పిస్తాము" అన్నాడు రంగారెడ్డి. శ్యామత్రావ్ మమ్మల్ని చూసి నవ్వి వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం చంద్రకాంత్ ఛటోపాధ్యాయ పరుగెత్తుకొచ్చాడు మా ఇంటికి.

"అర్జంటుగా మేధిపట్నం వెళ్దాం పదండి. అక్కడ బ్రహ్మాండమయినా కాలేజ్ ఉంది. ప్రిన్సిపాల్ మా బాబాయ్ ఫ్రెండ్ ఆట– రికమండేషన్ లెటర్ ఇచ్చాడు–" అందరం పదిగంటకల్లా ఆ కాలేజ్ చేరుకున్నాం– ప్రిన్సిపాల్ ఆ ఉత్తరాన్ని చూస్తూనే "ఒకే– మీక్కావలసిన సీట్లన్నీ ఇస్తాం" అన్నాడు ధీమాగా, అప్లికేషనులు పూర్తిచేసిచ్చాము.

మా అప్లికేషన్స్ అన్నీ చూశాడు ప్రిన్సిపాల్. చూస్తూనే నవ్వేశాడు.

"గహ్హా– గహగహ– గప్లికేషన్‌లో ఇంగ్లూస్ మీడిగెమ్ అని రాశారేమిటి? తెగులూ తెగులూ మీడిహెచ్ సీట్లున్నాయి" అన్నాడు.

"మేము మొఖాలు చూసుకున్నాం మళ్ళీ.

"కానీ మా వాళ్ళు టెన్త్‌వరకు ఇంగ్లీష్ మీడియంలో చదివారు కదండీ. ఇప్పుడు తెలుగు మీడియం అంటే కష్టం కదా?" అన్నాడు శాయిరామ్.

"కష్టమ్? కష్టం హేమి ఉంది! నన్ను సూడు! ఇంగ్లీష్ నోస్ మీ! తెగులూవస్తయి! ఉర్దూ వస్తయ్ అంతా! అన్ని లాంగ్వేజ్ భాషల్ వస్తయి నాకు! ఎందుకని? టెన్త్‌లో తెగులూ, ఇంటర్‌ల ఇంగ్లూస్! డిగ్రీలో ఉర్దూ "అంటూ ఆపి గహగహగహ' అంటూ మళ్ళీ నవ్వాడు.

మేము చేసేదిలేక తలూపాము. మిగతా అప్లికేషన్‌లు కూడా తీసి చూశాడతను

"ఇగో! బి.ఏ.తెలుగు మీడిహెమ్ లేదు. తమిళమీడిహెచ్ తీసుకోండి!"

"ఆ తమిళమా! తమిళం మనకెందుకండీ బాబు! మాకేం ఉపయోగం అది?" ఆయన మళ్ళీనవ్వాడు 'గహగహగహ– తమిళం వస్తే మన ముఖ్యమంత్రికి ఎడ్‌వైజర్ అంటే సలహాదారుడుగా పనిచేసి పూడ్చువచ్చు. ఎంతమంచి నౌకరి అది! అఛ్ఛాజాబ్‌హై" మళ్ళీ తలూపాము.

"ఇదిగో– ఇక్కడే ఇంగ్లీష్ మీడియం అనిరాసినయ్. బి.కామ్. ఉర్దూ మీడిహెమ్ సీటున్నాయి తీసుకోండి.ఉర్దూ మీడిహెమ్ తీసుకుంటే చాలా ఎక్కువ ప్రాఫెట్."

"ఏం చేద్దామంటారు?" అడిగాడు ఓ కుర్రాడి తండ్రి భయంగా.

"తప్పదు తీసుకోండి! ఇవాళే లాస్ట్‌డే! ఇంకో కాలేజీలో ఇప్పుడు వెళ్ళి అప్లికేషన్ ఫారమ్స్ ఇవ్వమన్నా ఇవ్వరు. మళ్ళా అప్లికేషన్ ఫారమ్స్ ఇవ్వాలంటే మనందరం మళ్ళీ నెలరోజుల శెలవుపెట్టి ఎడ్యుకేషన్ సెక్రటరీ దగ్గర పర్మిషన్ తెచ్చుకోవాలి. ఆ పర్మిషన్ ఆయనివ్వాలంటే మినిష్టర్ సెక్రటరీ దగ్గర రికమండేషన్ చేయాలి. కాలేజ్ ప్రిన్సిపాల్ రాసివ్వాలి. ఇదంతా అయ్యేవరకూ ఆ కాలేజీలో సీట్లుండాలి–" అన్నాడు రంగారెడ్డి.

మాట్లాడకుండా ఫీజులుకట్టి బయటపడ్డాము.

"ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు, తమిళం మీడియాల్లో కలగాపులగంగా చదివిన పిల్లలు ఎలాంటి ఫౌరులుగా తయారవుతో మాకు తెలుసు అలాంటివన్నీ చదివిన ఆ కాలేజ్ ప్రిన్సిపాల్ దానికి ఎగ్జాంపుల్" అన్నాడు శాయిరామ్ కాలనీ చేరుకున్నాక.

"ఆ గాడిద గుడ్డు లేస్తూ! వాళ్ళెలా తయారయితే మనకెందుకు! వాళ్ళెలాంటి భాషమాట్లాడితే మనకెందుకు! మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తగ్గట్లే పిచ్చి ఫౌరులుగా తయారవుతావు! అవనీ! ఆ గవర్నమెంటుకి సరిపోతారు" అంటూ 'గహ గహ గహ' అని నవ్వాడు రంగారెడ్డి.